7

సాక్షి పల్నాడు

ఆదివారం । 30 । జూలై । 2023



బోట్ల రాకపోకలు బంద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారీగా వస్తున్న వరద నీరు కారణంగా ఏపీటీడీసీకు చెందిన బోట్లను హరిత బరంపార్క్‌లో గల బోటింగ్ పాయింట్ వద్ద ఆపేశారు.



పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ ప్రాంతాలనుంచి వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వ శనివారం సాయంత్రానికి 30.70 టీఎంసీలకు చేరింది.

అమరేశ్వరుని సేవలో



అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామిని శనివారం రాజస్థాన్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంభజీ శివాజీ షిండే దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శిశు విహార్‌కు శిశువు తరలింపు



గుంటూరు మెడికల్: వారం రోజుల క్రితం వినుకొండ బస్టాండ్ బాత్‌రూములో వదిలి వెళ్లిన శిశువును కొందరు గుర్తించి, జీజీహెచ్‌కు తీసుకు రాగా పిల్లల వైద్య విభాగంలో చికిత్స అందించామని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది శిశువును పరీక్షించి, ఆరోగ్యం నిలకడగా ఉండటంతో శిశు విహార్‌కు శనివారం పంపించామని వెల్లడించారు. పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర సభల పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గుంటూరులోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర మహాసభలకు విచ్చేస్తున్నారని, ఉద్యోగులంతా భారీగా తరలి రావాలని కోరారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ బైలాకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి సభలకు విచ్చేస్తున్నారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అసోసియేషన్ జిల్లా సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, ఎస్.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి సుకుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి సి.హెచ్.కళ్యాణ్‌కుమార్, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, శేషగిరిరాజు, రాధారాణి, అంజలి, జయలక్ష్మి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



పట్నంబజారు: ప్రపంచ వ్యాప్తంగా పులులు తగ్గినప్పటికీ భారతదేశంలో 70 శాతం ఉన్నాయని, జీవ వైవిధ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యాపరిషత్ రూపొందించిన అంతర్జాతీయ పులుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అటవీ విస్తీర్ణం తగ్గడం, మానవ కార్యకలాపాల వల్లే పులుల సంఖ్య తగ్గిందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ పులుల సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. అంతరించి పోతున్న జీవజాతులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యాపరిషత్ సభ్యులు డి.తిరుపతిరెడ్డి, శాంతమూర్తి, కబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రికరణ‘శుద్ధి’

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి శుద్ధి ప్లాంట్లు
- కలుషిత నీటి కష్టాలకు చెక్
- పిల్లల ఆరోగ్య రక్షణకు చర్యలు
- ఒక్కో యూనిట్‌కు రూ.24 వేలు ఖర్చు
- దశల వారీగా విస్తరణకు ప్రణాళిక
- ఇప్పటి వరకు 79 ప్లాంట్లు

పెదకూరపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం త్రికరణశుద్ధితో కృషి చేస్తోంది. కలుషిత నీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. దశలవారీగా నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 79 ప్లాంట్లు ఏర్పాటు చేసింది.

చక్కటి పౌష్టికాహారం ..

ఇప్పటికే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైమరీ, ప్రీ–ప్రైమరీ స్కూళ్లుగా మార్చిన సంగతి తెలిసిందే. రేపటి ఆరోగ్యకర సమాజం కోసం చక్కని పౌష్టికాహారాన్నీ అందిస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా భవనాల రూపురేఖలనూ మారుస్తోంది. రంగురంగుల బెంచీలు, కుర్చీలు, బ్లాక్ బోర్డులు, ఆటవస్తువులు సమకూర్చి కార్పొరేట్ కిడ్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతోంది. దీనిలోభాగంగానే తాజాగా మరో అడుగు ముందుకేసి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నడుంబిగించింది.

పల్నాడు జిల్లాలో మొత్తం 9 ఐడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 2,010 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 565 కేంద్రాలకు సొంత భవనాలు సమకూరాయి. ప్రస్తుతం గర్భిణులు 14,467 మంది, బాలింతలు, 12,121 మంది, 0–6 ఏళ్లలోపు పిల్లలు 1,32,449 మంది నమోదై ఉన్నారు.

- మొదటి దశలో భాగంగా పల్నాడు జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలో ప్రభుత్వం 79 నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసింది. సొంత భవనాలు ఉన్న కేంద్రాలకు తొలుత ప్రాధాన్యం ఇస్తోంది. ఒక్కొక్క ప్లాంటుకు రూ.24,029 చొప్పున ఖర్చు చేసింది. 20 లీటర్లు సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్లు గంటకు 12 లీటర్ల చొప్పున తాగునీరు అందిస్తాయి. నీటి వసతి ఉన్న చోట్ల పైప్‌లైన్లకు కనెక్షన్ ఇస్తారు. నీటి వసతి లేని చోట బయట నుంచి నీరు తెచ్చుకుని ఆర్వో ప్లాంట్లలో పోయాల్సి ఉంటుంది. నీటి నాణ్యత తెలిపే టీడీఎస్ మీటర్ అమర్చి ఉంటుంది.

ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత వారిదే..

కేంద్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్‌లో భాగంగా నేషనల్ న్యూట్రిషియన్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత వారిదే.



75త్యాళ్ళూరులో క్యూలైన్‌లో నిలిచి మినరల్ వాటర్ తాగుతున్న అంగన్‌వాడీ చిన్నారులు

ప్రాజెక్టులవారీగా నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటు ఇలా..

ఐసీడీఎస్ ప్రాజెక్టు	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0–6 పిల్లలు	ప్లాంట్లు
ఈపూరు	132	886	736	7,995	12
సత్తెనపల్లి	303	1,954	1,596	18,860	14
క్రోసూరు	277	1,723	1,456	16,870	29
గురజాల	132	1,121	1,070	11,210	23

దశల వారీగా విస్తరణ



జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన ప్లాంట్లు చక్కగా పనిచేస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు శుద్ధ జలాలు అందిస్తున్నాయి.. మిగిలిన కేంద్రాల్లోనూ దశల వారీగా ఏర్పాటు చేస్తాం.

– అరుణ,
జిల్లా మహిళ,శిశు, సంక్షేమ అధికారి

చిన్నారుల ఆరోగ్యం కోసం



మా కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం అభినందనీయం. గతంలో తాగునీటికి ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎంతో ఇష్టంగా నీరు తాగుతున్నారు. చాలా ఉపయోగపడుతోంది.

– గుడిపూడి వజ్రమ్మ,
అంగన్‌వాడీ కార్యకర్త, 75త్యాళ్ళూరు

కొండవీడులో భక్తిశ్రద్ధలతో మొహర్రం

- గ్రామ వీధుల్లో నెలకొన్న సందడి
- విద్యుత్‌దీపాల అలంకరణ
- చావిడి వద్ద మొక్కులు తీర్చుకున్న భక్తులు
- కార్యక్రమాలకు భారీగా తరలివచ్చిన జనం



పంజాలను అలంకరించేందుకు ఊరేగింపుగా తెస్తున్న పూల సేరా (భాషికం)

యడ్లపాడు: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కొండవీడులో నిర్వహించే కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కొండవీడు, కోట గ్రామాల్లో పంజాలకు అలంకరణ చేసే సేరా (భాషికాలను) రెండు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు ఇరుగ్రామాల పెద్దలు, ముజావర్లు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. వివిధ మొక్కలు చేసుకున్న భక్తులు సైతాన్, చిరుతపులి వంటి వేషధారణ, కర్రసాము విన్యాసాలు చేస్తూ డీజే, డప్పు వాయిద్యాలతో సందడిగా చావిళ్లకు చేరుకున్నారు. కొండవీడు గ్రామంలోని ప్రధాన వీధి నుంచి పీర్ల చావిడి వరకు భారీ విద్యుత్ దీపాలను అలంకరణ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు చావిడి వద్దనే దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పీర్ల చావిడి ఎదురుగా పెద్దపెద్ద మొద్దల్ని తెచ్చి నిప్పుల గుండాన్ని సిద్ధం చేశారు. సర్వాంగ సుందరంగా తయారు చేసిన సేరా (పూలదట్టీ)లను మేళతాళలతో సంతోషంగా తెచ్చి చావిడిలో కొలువుదీరిన పంజాల అలంకరణకు భక్తులు సమర్పించారు. కులమతాలు బేధాలు లేకుండా భక్తులు అధిక సంఖ్యలో హాజరై కొబ్బరి కాయలు కొడుతూ, పాలతో తయారైన పానకాన్ని పంచి పెడుతూ తమ మొక్కుల్ని తీర్చుకున్నారు. అగ్రిగుండ చుట్టు ప్రదిక్షణలు చేస్తూ అమరుల్ని స్మరించుకున్నారు. మొహరం ఉపవాస దీక్షలు చేపట్టిన ముజావర్లు అర్ధరాత్రి హజ్రత్ అలి పంజాను పట్టుకుని నిప్పులు గుండంలో తిరిగాడారు. హస్సేన్..హుస్సేన్ ధూలా అంటూ భక్తిభావంతో తన్మయత్వం చెందుతూ అమరుల్ని స్మరిస్తూ అగ్ని గుండంలోతిరుగాడే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు ఎగబడ్డారు. శనివారం సాయంత్రం ఇరుగ్రామాల్లోని పంజాలను భారీగా ఊరేగింపు చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. రెండు రోజుల పాటు రెండు గ్రామాలకు చెందిన వారంతా ఆయా కార్యక్రమాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండవీడులోనే మసీదు వద్ద, కోట గ్రామంలోని పంచాయతీ కార్యాలయం పక్కన చావిళ్లలోనూ పంజాలను ఏర్పాటు చేశారు. అన్ని పంజాలను ఇదే ఊరేగింపులో తీసుకువచ్చారు. ఇరు గ్రామాల ప్రజలతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి సందర్శించారు. పీర్లను అలంకరించి అమరుల్ని స్మరిస్తూ ప్రార్థలను చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎస్‌ఐ పి.సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు.

నేడు యార్డు చైర్మన్‌గా రాజనారాయణ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న నిమ్మకాయల రాజనారాయణ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు యార్డు నూతన చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా ఎంపిక చేశారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా మిర్చి యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరి సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని, అంతేకాకుండా మిర్చి, కారం పొడుల ద్వారా మరో రూ.5 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని వెల్లడించారు. 15 వేల మందికి పైగా జీవనోపాధి కల్పిస్తున్న రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. యార్డులో ఉన్న సమస్యలను అధిగమించి మిర్చి రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తామని చెప్పారు. వ్యాపారులు, రైతుల మధ్య వారధిగా నిలిచి అందరి సహకారంతో సమస్యలు అధిగమిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా యార్డుకు వచ్చే ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా హమాలీలు, వేమెన్స్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. యార్డులో పనిచేసే గర్భిణులకు నెల నుంచి రెండు మాసాలు వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. యార్డులో పనిచేసే హమాలీలు, కూలీల ఆరోగ్య సమస్యల కోసం కాటూరి మెడికల్ కళాశాల డాక్టర్ల సహకారంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఒక్కరోజే గడువు

ఈకేవైసీ ఉంటేనే రైతు భరోసా (పీఎం కిసాన్) సాయం

- రేపటితో ముగియనున్న గడువు
- జిల్లాలో ఇప్పటి వరకూ 88శాతం పూర్తి
- రాష్ట్రంలోనే పల్నాడుకు రెండోస్థానం



ఆర్‌బీకేలో రైతుకు ముఖ ఆధారిత ఈ-కేవైసీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: ప్రభుత్వ పథకాలలో రైతులకు ఏదైనా లబ్ధి చేకూరాలంటే ఈ–క్రాప్, ఈ–కేవైసీ తప్పనిసరి. సాగులో ఈ–పంట నమోదు అంశం ఎంతో కీలకం. సాగైన పంటలను నమోదు చేస్తేనే ప్రభుత్వ పరమైన రాయితీలు అందుతాయి. అలాగే సాగు అవసరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా అందించే పెట్టుబడి సాయం పొందాలంటే రైతులు ఖచ్చితంగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) చేయించాలి. 12వ విడత నుంచి ఈ–కేవైసీ తప్పనిసరి చేసినా.. గతేడాది 12, 13వ విడత వైఎస్సార్ రైతు భరోసా (పీఎం కిసాన్) సొమ్ములకు రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం నిబంధనలు సడలించి నగదును రైతుల ఖాతాలకు జమ చేసింది. తాజాగా విడుదల చేసిన 14వ విడతకు ఖచ్చితంగా ఈ–కేవైసీ ఉండాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 88శాతం పూర్తి...

జిల్లాలో ఈ–కేవైసీ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. జిల్లాలోని 28 మండలాల పరిధిలో 88శాతం ఇప్పటికే అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఈ ప్రక్రియ నమోదులో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 90శాతం ఈ–కేవైసీ పూర్తి చేసినవి 7 జిల్లాలు ఉండగా, 80శాతానికి పైగా 15 ఉన్నాయి. 88శాతంతో పల్నాడు జిల్లా రెండో స్థానంలో నిలిచింది. కేంద్రం నిర్దేశించిన గడువు జూలై 31 వరకు మాత్రమే ఉండడంతో అన్నదాతలు ఈ–కేవైసీ నమోదులో అప్రమత్తం కావాలని అధికారులు, వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,12,460 మందికి వైఎస్సార్ రైతు భరోసా (పీఎం కిసాన్) ఖాతాలు ఉన్నాయి. వీరిలో ఇప్పటికే 1,86,915 మంది రైతులు ఈ–కేవైసీ నమోదు చేయించుకోగా, మరో 25,545 మంది నమోదు ప్రక్రియకు దూరంగా ఉన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి వారు ఈ–కేవైసీ నమోదు చేసుకోకుంటే 14వ విడత సాయం వారికి అందడం కష్టమేనని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.

నమోదు సులభతరం...

ఇంటర్నెట్‌పై అవగాహన ఉంటే వెబ్‌సైట్ ద్వారా నేరుగా నమోదు చేసుకోవచ్చు. www.pmkisan.gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన అండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో కూడా ఈ–కేవైసీ చేసుకునే అవకాశం ఉంది. లేకుంటే రైతు ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరుతో మీ–సేవ లేదా కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌బీకే అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదిస్తే చాలు. అక్కడ రైతు బయోమెట్రిక్ (వేలిముద్రలు) తీసుకుని ఈ–కేవైసీ చేస్తారు. వేలిముద్రలు పడని రైతుల కనుపాపలతో ముఖ ఆధారిత యాప్ ద్వారా ఈ–కేవైసీని వ్యవసాయశాఖ సిబ్బంది పూర్తి చేస్తున్నారు.

తప్పని సరిగా నమోదు చేసుకోవాలి



రైతులు వ్యవసాయ పథకాలు, రాయితీలు ఏదీ పొందాలన్న ఈ–కేవైసీ ప్రామాణికమని గుర్తించాలి. అంతేకాకుండా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం పొందడానికి కూడా ఈ–కేవైసీ ఉండాల్సిందే. కాబట్టి ఇంకా ఈ–కేవైసీ నమోదు చేసుకోని రైతులు తక్షణం స్పందించి సద్వినియోగం చేసుకోవాలి. అందుబాటులో లేని రైతులు తమ సన్నిహితుల ద్వారా ఆధార్ నంబర్, సెల్‌నంబర్ తెలియజేసి, అనుసంధానం సమయంలో ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది.

– ఎ.శ్యామ్ ప్రసాద్, జేసీ, పల్నాడు జిల్లా

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: స్పెషల్ సమ్మరీ రివిజన్– 2024 ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి, అధికారులంతా సమన్వయంతో పనిచేసి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 2, 3 తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి నివేదికను అందివ్వనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితా రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారీలో వస్తున్న ఇబ్బందులు అధిగమించి నూతన విధి, విధానాలను పాటిస్తూ రూపకల్పన చేయాలని ఆదేశించారు. గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులు, పిల్లలకు టీకాలు

వచ్చేనెల నుంచి మిషన్ ఇంద్రధనస్సు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఆగస్టు నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి తెలిపారు. పల్నాడు రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా వ్యాధి నిరోధక టీకాలు పొందని, మధ్యలో ఆపేసిన గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించారన్నారు. జిల్లాలో 54 మంది గర్భిణులు, 776 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారన్నారు. వీరందరికీ ఆగస్టు ఏడో తేదీ నుంచి 12వ వరకు ప్రత్యేకమైన 346 వ్యాధి నిరోధక సెషన్లు, 327 మంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తల ద్వారా టీకాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే సెప్టెంబర్ 11 నుంచి 16వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర పనివారు, వలస కూలీలు, పట్టణ మురికివాడలలో నివసిస్తున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. కావున అందరూ ఈ విషయాలను గుర్తించి తమ బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి తద్వారా వారిని ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం మీ ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య అధికారి (ఎంఎల్‌హెచ్‌పి), ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను సంప్రదించాలని కోరారు.

జిల్లా ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక


ఎంపికైన బాలబాలికల జట్లతో హెచ్‌ఎంలు, పీడీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అండర్–13 బాలబాలికల జట్ల ఎంపిక శనివారం నిర్వహించారు. స్థానిక సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 200 మంది హాజరయ్యారు. ఎంపికైన జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో మాదల జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయుడు షేక్ రజాక్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీ ఏ శ్రీరామ్ రెడ్డి, పీడీలు షేక్ మహమ్మద్ రియాజ్, సిహెచ్.సుధారాణి, పి.నాని, పి.సురేష్, షేక్.జాన్ సైదా, సత్యవతి, సెక్రెటరీ జోష్‌పీటర్, ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎంపికైన బాలికల జట్టు ఇదే....

టి.మహేశ్వరి, వి.సహస్ర, ఎస్.దుర్గ, ఎస్.యాష్మిత, ఎస్.మాక్సి(ప్రణీత), బి.అమృత, జి.నవ్య,వి.శ్రీలత, వై.లావణ్య, ఎస్.శ్రావ్య, సిహెచ్ తేజశ్రీ, టి.త్రివేణి, ఎం.ఐశ్వర్య, ఆర్. శ్రావ్య, పి.ఈశ్వరి, ఎస్.మౌనిక, ఎస్.మంజుల, పి.గాయత్రి, పి.పుష్పలత, ఆర్. ప్రసన్న, కె.వైష్ణవి, వై.తేజస్విని ఎంపికయ్యారు.

బాలురు జట్టు..

టి.శరత్, కె.కార్తీక్, జి.వికాస్, జి.నవీన్,జే.శ్రీరామ్, వై.మంగ శివ గణేష్, జే.సాగర్, పి. వెంకటేష్, కే సాంబశివరామ్, పి.నాగరాజ్, సిహెచ్.ఎలీషా, సిహెచ్.హిమంత్, వి.యశ్వంత్ రెడ్డి, పి.పాల్‌రాజ్, షేక్ నిహాల్ మస్తాన్, షేక్ మాబూబ్ జానీ, కె.ప్రశాంత్‌బాలు, ఎన్‌బీ మహమ్మద్ రఫీ, కె.ఆకాష్, కె.యశ్వంత్, వి.విరాట్, షేక్ ఇమ్రాన్, షేక్ మహమ్మద్ యాసిన్, జి.రవిభాస్కర్, పి.శ్రీను, టి.సిద్దు, షేక్. ధరియావలి ఎంపికయ్యారు.

మద్యం కేసులో టీడీపీ నాయకుడి అరెస్ట్


సెబ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన నిందితులు ఏడుకొండలు, కనకరావు

మాచవరం/పిడుగురాళ్ల: అక్రమ మద్యం రవాణా, విక్రయాలను టీడీపీ నేతల యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఇటీవల మండలంలోని చెన్నాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పలు అక్రమ మద్యం రవాణా, విక్రయ కేసుల్లో అరెస్ట్ కాగా, శనివారం సెబ్ అధికారులు జరిపిన దాడుల్లో మండలంలోని రేగులగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అలవాల ఏడుకొండలుతో పాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కలగాని కనకారావులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నిల్వ ఉన్న 180 ఎం.ఎల్.పరిమాణం కలిగిన 23 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలవాల ఏడుకొండలు గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచిగా టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయాడు. ఇప్పుడు తెలంగాణ మద్యం విక్రయిస్తూ సెబ్ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా సెబ్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సరిహద్దుగా ఉన్న ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం రవాణా చేసినా, విక్రయాలు జరిపినా ఎవర్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, బీఎంపీపీ ఎస్ఐ బి.దీప్తి కారంత్, సిబ్బంది డి.వెంకటేశ్వరావు, కె.మురళి నాగవర్మ నాగరాజు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు .

గ్రామ సచివాలయ పరిధిలో డిజిటల్ లైబ్రరీలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు


పురాతన దినపత్రికలను పరిశీలిస్తున్న శేషగిరిరావు, సునీత

వేటపాలెం: గ్రామస్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకుల కోసం గ్రామ సచివాలయం ఉన్న ప్రతి చోట డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక వేటపాలెం సారస్వత నికేతనం గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పోతుల సునీత ఉన్నారు. గ్రంథాలయంలోని పురాతన పుస్తకాలు, దినపత్రికల సంపుటాలను పరిశీలించారు. గ్రంథాలయ చరిత్రను లైబ్రేరియన్లను అడిగి తెలుసుకున్నారు. శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అట్టడుగు వర్గాలకు గ్రంథాలయ సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. రూ.20 లక్షల నిధులతో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని చోట్ల డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు పూర్తియ్యాయన్నారు. ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసి పేద బడుగుబలహీన వర్గాలకు ఇంగ్లిష్ మీడియం చదువుకునేలా అవకాశం కల్పించారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లుతునానయని విమర్శించారు. చిత్తశుద్ధితో ప్రజాహితం కోసం పని చేస్తోందన్నారు.

రేషన్ పంపిణీలో నరసరావుపేట టాప్

- రెండో స్థానంలో చిలకలూరిపేట
- జిల్లా వ్యాప్తంగా 87.92 శాతం మందికి పంపిణీ


పట్టణంలో లబ్ధిదారురాలికి సార్టెక్స్ గోధుమ పిండి అందజేస్తున్న డీఎస్‌ఓ పద్మశ్రీ(ఫైల్)

నరసరావుపేట: పేదలకు రేషన్ సరుకులు జూలై నెలలో అత్యధికంగా నరసరావుపేట మండలంలో 93.35 శాతం మందికి అందజేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆ తర్వాతి స్థానం చిలకలూరిపేట మండలానికి దక్కిందని, ఇక్కడ 92.13 శాతం మందికి పంపిణీ చేశామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెలలో కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, పంచదార, పట్టణ ప్రాంత ప్రజలకు సార్టెక్స్ గోధుమ పిండి అందజేయటం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,36,405 కార్డుదారులు ఉండగా 1289 రేషన్ షాపుల ద్వారా 402 సంచార వాహనాల సహాయంతో ఇంటింటికి తిరుగుతూ 5,59,507(87.92 శాతం) మందికి అందించినట్లు వివరించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకర్

సంతమాగులూరు(అద్దంకి): హత్య కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సంతమాగులూరు సీఐ ప్రభాకర్ అందించిన వివరాలు.. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం యానాది కాలనీకి చెందిన కోటేశ్వరరావు(20)కు కూలి పనులు చేస్తుంటాడు. రామలింగం ఈనెల 26న పనులకు అడ్వాన్స్‌గా రూ.2 వేలు ఇచ్చాడు. తరువాత ఇద్దరూ కలసి మందు తాగడానికి వెళ్లి ఉదయం 11 గంటలకు కాలనీకి చేరారు. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో రామలింగం, కోటేశ్వరారవు ఇంటి వద్దకు వెళ్లి, నీ భర్త ఎక్కడ అని అడిగాడు.. ఆమె నాకు తెలియదని చెప్పడంతో రామలింగం దూషించుకుంటూ వెళ్లిపోయాడు. ఆ తరువాత కొంచెం సేపటికే కోటేశ్వరరావు ఇంటికి చేరాడు. భార్య జరిగినదంతా కోటేశ్వరరావుకు చెప్పింది. వెంటనే కోటేశ్వరరావు రామలింగం ఇంటికి వెళ్లి నా భార్యను ఎందుకు తిట్టావని అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోటేశ్వరరావు నేను నీవద్దకు పనికి రానని చెప్పడంతో రామలింగం కోపోద్రిక్తుడై అడ్వాన్స్ తీసుకుని పనికి రానంటావా అంటూనే పక్కనే ఉన్న వేపకర్ర తీసుకుని కోటేశ్వరరావు తలపై దాడిచేశాడు. బలమైన గాయాలైన కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందడంతో రామలింగం అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య పోట్లూరి ఏసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి రెండు రోజుల దీక్ష

నరసరావుపేట: ఉద్యోగ భద్రత కల్పిస్తూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 7,8 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపునున్నట్లు వీఆర్‌ఏల సంఘం (సీఐటీయు అనుబంధం) జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ వెల్లడించారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం వీఆర్‌ఏల సంఘ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ పే స్కేలు, నామినీ, ప్రమోషన్లు మొదలగు సమస్యల పరిష్కారం కోసం రెండురోజులపాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్, గుంటూరు మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆగస్టులో యూజీనిఎస్-2023 క్విజ్ పోటీలు

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ స్థాయి యూజీనిఎస్– 2023 క్విజ్ పోటీలకు జిల్లాలోని అన్ని యాజమాన్యాలలో పని చేస్తున్న పాఠశాలలు తమ విద్యార్థులను పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి గరిష్ఠంగా 4 టీమ్‌లు పంపవచ్చని, టీమ్‌కు ఇద్దరు చొప్పున ఉండాలని వివరించారు. భారత దేశపు సాధారణ అవగాహన, క్రీడలు, ఫైనాన్స్, ప్రముఖ వ్యక్తుల జీవిత విశేషాలు, బ్యాంకింగ్, చరిత్ర, భూగోళశాస్త్రం తదితర అంశాల నుంచి క్విజ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలుతో పాటు పలు బహుమతులు అందిస్తారని తెలిపారు. ఆగస్టు 29వ తేదీన విజయవాడ మేరీస్టెల్లా కళాశాలలో నిర్వహించనున్న పోటీలకు బ్యాంక్ యాజమాన్యం ఉచిత ప్రయాణ, భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తుందని చెప్పారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏపీ మధుకుమార్ 9032871234ను సంప్రదించాలని సూచించారు.